హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.119	173	196
సూర్యాపేట	రూ.120	170	200
నల్లగొండ	రూ.122	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 17.6

పండుగ ఖర్చు

రూ.102 కోట్లపైనే

- మద్యంపై రూ.66.73 కోట్లు
- మటన్‌పై రూ.30 కోట్లు
- చికెన్, స్వీట్స్, బేకరీ, ముగ్గులకు రూ.6 కోట్లు



సంక్రాంతి పండుగంటే ప్రతి ఇంటా సందడే ఉంటుంది. పాడిపంటలు ఇంటికి చేరడం, నూతన వధూవరులు, బంధువులు, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుకుంటారు. వీరందరి రాకతో గ్రామాలు కళకళలాడుతుంటాయి. ప్రతీ గడపలో సందడి వాతావరణం నెలకొంటుంది. పండుగ నేపథ్యంలో ప్రతి ఇంటా పిండివంటలు, మటన్, చికెన్‌తో పాటు వివిధ రకాల వంటలు చేస్తుంటారు. అదేవిధంగా ఇంటి ముందు ముగ్గులు, చిన్నారుల గాలిపతంగులు, సాయంత్రంలో వేళ మద్యం ప్రియులతో మూడు రోజులూ పండుగ సందడి ఉంటుంది. పండుగ ప్రతి ఇంటా సంతోషాన్ని నింపడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు కాసులు కురిపిస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసులు సంక్రాంతి పండుగ కోసం మద్యం, మాంసం, స్వీట్స్, ఇతర అవసరాల కోసం సుమారు రూ.102.73 కోట్లు ఖర్చు పెట్టేశారు.

- కోదాడ

ఉమ్మడి జిల్లాలో 299 వైన్స్ దుకాణాలు ఉన్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 13 నుంచి 17 వరకు నల్లగొండ, యాదాద్రి మద్యం డిపో పరిధిలో భారీగా విక్రయాలు జరిగాయి. ఐదు రోజుల్లో రెండు డిపోల పరిధిలో 92,015 బీర్లు, 59,766 లిక్కర్ కేసులు మొత్తం 1,51,781 కేసుల మద్యం విక్రయాలు జరిగాయి. కాగా వీటి విక్రయాల ద్వారా రూ.66.73 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది.

ఉమ్మడి జిల్లాలో 1,144 గ్రామాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,144 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో పండుగను పురస్కరించుకుని గ్రామానికి 15 గొర్రెలను కోసినట్లు సమాచారం. ఒక్కో గొర్రె 25 కిలోల చొప్పున 15 గొర్రెల నుంచి 375 కిలోల మాంసం విక్రయించినట్లు చెబుతున్నారు. ఆ చొప్పున ఉమ్మడి జిల్లాలో సుమారు 4.29 లక్షల కిలోల మటన్ విక్రయాలు జరగ్గా, కిలోకు రూ.700 చొప్పున జిల్లా వాసులు రూ.30 కోట్లు ఖర్చు చేశారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో సుమారు 240చికెన్ దుకాణాలు, 120 బేకరీలు, 144స్వీట్ దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాల్లో పండుగ రోజున చికెన్, బేకరీ, స్వీట్స్, ముగ్గులపై సుమారు రూ.6 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. మొత్తంగా సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లావాసులు సుమారు రూ.102.73 కోట్లు ఖర్చు చేశారు.

కాల్వలు పూర్తికావు..

నీళ్లు పారవు

- ఐదేళ్లుగా కొనసాగుతున్న ఆధునికీకరణ పనులు
- పలుసార్లు గడువు పెంచినా కానరాని ఫలితం
- ఆయకట్టు చివరి భూములకు అందని నీరు



ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టులో మూసీ రెండోది. ఈ ప్రాజెక్టు కింద ఆయకట్టును స్థిరీకరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఐదేళ్ల కిందట చేపట్టిన కాల్వల ఆధునికీకరణ పనులు ముందుకు సాగడం లేదు. 40 వేల ఎకరాల సాగు విస్తీర్ణం లక్ష్యంగా పెట్టుకున్నా ఆరు అరు దశాబ్దాలుగా 33 వేలు దాటలేదు. కాల్వలు దెబ్బతినడం, విడుదల చేసిన నీరు వృథాగా పోతుండటంతో చివరి ఆయకట్టుకు నీరందడం గగనమవుతోంది. రూ.65.55 కోట్ల నిధులు కాల్వల ఆధునికీకరణకు మంజూరు చేసినా నేటికీ 70 శాతం పనులు పూర్తి కాలేదు. వెరసి లక్ష్యం నీరుగారిపోతుండగా, చివరి ఆయకట్టుకు నీరందడం లేదు.

- వివరాలు 7లో

అంగన్‌వాడీలు అప్‌గ్రేడ్

- 901 కేంద్రాల్లో 57 మినీకేంద్రాలు
- నాలుగు ప్రాజెక్టులు: ఖాళీగా పోస్టులు

నిరుపేదలకు పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో నడిచే ఈ కేంద్రాలను మరింత పటిష్ఠం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే అధికసంఖ్యలో బాలింతలు, గర్భిణులు పిల్లలు కేంద్రాలకు వస్తుండగా మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి ప్రభుత్వం ముందడుగు వేసింది.

- భువనగిరి అర్బన్




మినీ అంగన్‌వాడీకేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రభుత్వం ఇటీవల అప్‌గ్రేడ్ చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో యాదాద్రిభువనగిరి జిల్లాలోని 57 మినీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ కాగా ఇదివరకు ఉన్న 844 కేంద్రాలకు గాను అప్‌గ్రేడ్ చేసిన వాటితో కలిసి 901కి చేరాయి. జిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రాజెక్టులు ఉండగా వీటి పరిధిలో 57 కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యాయి. భువనగిరి పరిధిలో 8, రామన్నపేట 28, ఆలేరు 11, మోత్కూరు 10 కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యాయి. 300 మంది గిరిజన జనాభా, 400 మంది అర్బన్ జనభా కలిగిన ప్రాంతాల్లోని మినీకేంద్రాలు ప్రధానకేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 865మంది అంగన్‌వాడీలు ఉండగా 772 మంది ఆయాలు పనిచేస్తున్నారు. ఇందులో టీచర్లకు రూ.13,650, ఆయాలకు రూ. 7,800 వేతనం అందుతోంది. అప్‌గ్రేడ్‌తో ఆయా కేంద్రాల్లో పనిచేసే టీచర్ల వేతనాలు పెరగడంతో ప్రయోజనకరంగా ఉండగా అప్‌గ్రేడ్ కేంద్రాలకు ఆయాలను నియమించాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా 36మంది టీచర్లు, 129మంది ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇది వరకు మినీకేంద్రాల్లో టీచర్ ఒక్కరే ఉండి ఆయాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తేవి. అప్‌గ్రేడ్ చేసిన తర్వాత కేంద్రాలకు ప్రభుత్వం ఆయాలను నియమించనుంది.

కుటుంబ సర్వే ఆధారంగా

రెవెన్యూ గ్రామాలు, అవాసాల నడుమ దూరం ఉండటంతో నాటి ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో మినీ కేంద్రాలను ఏర్పాటుచేసింది. వాటి పరిధిలో ప్రస్తుతం కుటుంబాలు పెరగడంతో సేవలు అందించడం కష్టంగా మారింది. దీంతో ప్రభుత్వం మినీకేంద్రాలను అప్‌గ్రేడ్ చేసింది. ప్రధాన కేంద్రాలుగా విస్తృతపర్చాలనే విన్నపాలతో పదేళ్ల క్రితం ఏర్పడిన మినీ కేంద్రాలు జనాభా ప్రాతిపదికన కుటుంబ సర్వే ఆధారంగా ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి.

ఆదేశాలు అందగానే నోటిఫికేషన్ జారీ చేస్తాం



ఆయా కేంద్రాల్లో టీచర్లు, ఆయాల పోస్టులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందగానే నోటిఫికేషన్ జారీ చేస్తాం. జిల్లా వ్యాప్తంగా 57మినీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఈ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆదేశాల అమలుకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలతో ముందుకు సాగుతాం.

- జీ అన్నపూర్ణ, (మహిళ, శిశు సంక్షేమ అధికారి, యాదాద్రి జిల్లా)



ఓటు నమోదుకు

ఇష్టపడట్లే

- పట్టభద్రుల ఎన్నికలపై నిరాసక్తత
- ఓటు నమోదుకు మిగిలింది 18రోజులే
- నేటికీ నమోదు చేసుకుంది 53 వేలు మాత్రమే
- మూడేళ్ల కిందట ఓటేసినవారి సంఖ్య 5 లక్షలపైనే

ఓటు హక్కు కోసం పట్టభద్రులు ఆసక్తి చూపించడం లేదు. మూడేళ్ల కిందట నల్లగొండ, ఖమ్మం,వరంగల్ పట్టభద్రుల స్థానానికి జరిగిన ఎన్నికలకు ఆయా పార్టీల నాయకులతో పాటు అర్హులైన పట్టభద్రులు ఓటు హక్కు నమోదుకు ఆసక్తి చూపించారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాజకీయ పరిస్థితులు మారడంతో ప్రస్తుత పట్టభద్రుల స్థానానికి జరుగుతున్న ఉపఎన్నికపై ఓటర్లు ఆసక్తి చూపించడం లేదు. వెరసి ఈ స్థానంలో 12 జిల్లాల నుంచి 53 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 20 వేల మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దీంతో అధికారులు నూతన ఓటర్ల నమోదుకు కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు.

నల్లగొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సరిగ్గా మూడేళ్ల కిందట నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల స్థానానికి జరిగిన ఎన్నిక భారీ పోరును తలపించింది. పల్లా రాజేశ్వరరెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, తీన్మార్ మల్లన్న, వామపక్షాల అభ్యర్థిగా జయసారధి డీ అంటే డీ అన్నట్టు తలపడ్డారు. నోటిఫికేషన్‌కు ముందు నుంచే రాజకీయపక్షాలు తమ అభ్యర్థులు, పొత్తులు, పరోక్ష మద్ద తు వంటి అంశాలపై జోరుగా కసరత్తు చేశాయి. ఓటర్ల నమోదుకు ఎవరికి వారు పోటీ పడ్డారు. ఓటర్లను పోలింగ్ బూత్‌కు తరలించేందుకు అభ్యర్థులు, రాజకీయపక్షాలు అవిశ్రాంతంగా శ్రమించాయి. పోరు రసవత్తరంగా మారి నిరుద్యోగుల్లో ప్రభుత్వ వ్యతిరేక త ఉన్నప్పటికీ పల్లా రాజేశ్వరరెడ్డి విజయం సాధించగా విజయం సాధిస్తారు అనుకున్న కోదండరాం మూడో స్థానానికి పరిమితం కాగా సైలంట్ ఓటింగ్‌తో తీన్మార్ మల్లన్న రెండో స్థానంలోకి వచ్చి వార్తల్లో నిలిచారు. పల్లా రాజీనామాతో ఆరేళ్లకు జరగాల్సిన ఎన్నిక మూడేళ్లకే అనివార్యమైంది. ఓటర్ల నమోదుకు తుదిగడువుకు మరో 18 రోజులే మిగిలి ఉండగా నేటికీ 53 వేల మందే దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఇందులో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓటర్లు 20వేల మంది ఉండటం గమనార్హం.

మూడేళ్లలో మారిన పొలిటికల్ సీన్..

సరిగ్గా మూడేళ్ల కిందట రాజకీయం రంజుగా ఉంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఏడేళ్లు కావడం.. ఆ సమయంలో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు లేకపోవడంతో ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి కనబరిచారు. నీళ్లు, నిధులు, నియామకాల ఎజెండాతో బీఆర్ఎస్ అధికారంలోకి రాగా నోటిఫికేషన్లు లేక, నిరుద్యోగుల ఉద్యమాలను అణిచివేసేందుకు నాటి రాష్ట్రప్రభుత్వం యూనివర్సిటీలపై నిషేధం విధించగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేధావులు, యువత స్వరం వినిపించే ప్రయత్నం చేశాయి. ఆ ఎన్నికను ఛాలెంజ్‌గా తీసుకున్న బీఆర్ఎస్ వారి పక్షాన అన్నివిధాలా సమర్థుడైన పల్లా రాజేశ్వరరెడ్డిని తెరపైకి తెచ్చింది. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పల్లా బలమైన వ్యక్తిగా భావించి గులాబీ బాస్ కేసీఆర్ ఆయనను బరిలో ఉంచారు. పల్లాకు పెద్దసంఖ్యలో విద్యాసంస్థలు ఉండటంతో వారి సిబ్బంది ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ ముగిసేవరకు పెద్దసంఖ్యలో భాగస్వాములయ్యారు. ఇంజనీరింగ్ కళాశాలల యాజమానుల రాష్ట్ర సంఘంలో పల్లా కీలక బాధ్యతల్లో ఉండటంతో ఓటర్ల నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నమోదు చేయించారు. అదేరీతిలో ప్రభుత్వానికి వ్యతిరేకించే శక్తులు, మేధావులు, ప్రొఫెసర్ కోదండరాంకు మద్దతుగా నిలిచాయి. ఆయన స్థాపించిన తెలంగాణ జన సమితి(టీజేఎస్) నాయకులు, కార్యకర్తలు ఓటర్లను నమోదు చేయించారు. సోషల్ మీడియా ఆయుధంగా ఎదిగిన జర్నలిస్టు తీన్మార్ మల్లన్న భారీగా అనుచరగణాన్ని ఏర్పరుచుకున్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల పరిధిలోని 12 జిల్లాలో ఆయన టీంతో కలిసి మల్లన్న పాదయాత్ర చేశారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలో వామపక్షాలు బలంగా ఉన్నాయి. వారికి అనుబంధంగా విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాలు బలంగా ఉన్నాయి. వారంతా తమ ఉమ్మడి అభ్యర్థిగా వామపక్షవాది, జర్నలిస్ట్ జయసారధిని అభ్యర్థిగా బరిలో నిలిపాయి. మొత్తంగా ఈ నలుగు రు హోరాహోరీగా పోరాడటంతో మూడేళ్ల కిందట పట్టభద్రుల ఎన్నిక రసవత్తరంగా జరిగింది.

నేటికీ నమోదు చేసుకుంది 53 వేలే

పట్టభద్రుల స్థానానికి 2021లో ఫిబ్రవరి 23న పోలింగ్ జరగ్గా 5,05,565 ఓట్లు నమోదయ్యాయి. ఇందులో పురుషులు 3,32,634 కాగా, మహిళలు 1,72,864 మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు 67 మంది ఉన్నారు. 12 జిల్లాల్లో మొత్తం 731 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేశారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటరు నమోదుకు అర్హులైన పట్టభద్రులు గతంలో ఓటర్‌గా నమోదైన వారు కూడా ఫారం-18 ద్వారా విధిగా ఫిబ్రవరి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. 2020 నవంబరు 1 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటరు జాబి తా, ఏప్రిల్ 4న తుదిజాబితా ప్రచురించనున్నారు. మూడేళ్ల కిందట ఐదు లక్షలకు పైగా ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోగా ప్రస్తుతం 53,316 మంది మాత్రమే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడం అధికారులను, రాజకీయపక్షాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 12 జిల్లాల్లో 53,316మంది ఓటు కోసం దరఖాస్తు చేసుకోగా అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూడు జిల్లాల నుంచి 20వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఓటర్ల సంఖ్యను పెంచేందుకు పట్టభద్రుల ఎన్నికల అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన చర్యలు ప్రారంభించారు. ఈ నెల 22న 12 జిల్లాల ఆర్డీవోలతో నల్లగొండలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఓటర్ల నమోదు సంఖ్యను పెంచేందుకు దిశానిర్దేశం చేయనున్నారు.

వరుస ఎన్నికలతో నిరాశ

ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారాయి. ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం మారింది. పదేళ్ల సుదీర్ఘ ఎదురుచూపుల తరువాత కాంగ్రెస్ అధికారం చేపట్టింది. ప్రభుత్వంపై వ్యతిరేకత అనే ఆలోచనే ప్రస్తుతం మొలకెత్తలేదు. ఈ పాటికే పట్టభద్రుల నోటిఫికేషన్ వచ్చేసింది. రాజకీయ పార్టీల దృష్టి అంతా ఎంపీ ఎన్నికలపైనే ఉంది.మరో రెండు నెలల్లో ఎంపీ ఎన్నికలు పూర్తి కానున్నాయన్న ధ్యాసతో రాజకీయ పక్షాలు పావులు కదుపుతున్నాయి. ఇక అభ్యర్థుల విషయానికొస్తే గతంలో గెలిచిన పల్లా జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీజేఎస్ చైర్మన్ కోదండరాంకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా అవకాశం దక్కనుంది. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డినే ఇటీవల ప్రకటించారు. గవర్నర్ కోటాలో ఆయనకు అవకాశం దక్కనుంది. ఇక తీన్మార్ మల్ల న్న కాంగ్రెస్ పక్షాన భువనగిరి ఎంపీ స్థానంపై బలంగా గురిపెట్టారు. ప్రస్తుతం జరిగే పట్టభద్రుల ఉపఎన్నిక తాజా ప్రభుత్వంపై ప్రజాభిప్రాయానికి మచ్చుతునక అనే పరిస్థితి లేకపోవడం వంటి వరుస పరిణామా ల నేపథ్యంలో రాజకీయపక్షాలు, నా యకులు పోటీకి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో పట్టభద్రుల ఎన్నిక అంటేనే నిరాసక్తత నెలకొంది.

ఓటు నమోదుకు విస్తృత ప్రచారం చేస్తున్నాం



ఓటర్ల సంఖ్యను పెంచేందుకు వివిధ మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. రాజకీయ పార్టీలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నాం.ఇటీవలే పండుగ సెలవులు ముగిసిన నేపథ్యంలో డీఈవోలు,ఆర్‌ఐఓలతో సమావేశం నిర్వహించి ఉపాధ్యాయుల ఓట్లు నమోదుచేసేలా ఆదేశాలు జారీ చేశాం.ప్రభుత్వకార్యాలయాల్లో సైతం ఓటర్లు నమోదు చేసుకునేందుకు చైతన్యం చేయాల్సిందిగా అన్ని విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.రాబోయే రోజుల్లో నమోదును పెంచేందుకు ఎన్నికల కమిషన్ అధికారి సూచన మేరకు ముందుకు వెళ్తాం.

- హరిచందన, పట్టభద్రుల ఎన్నికల అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్

ఓటరు జాబితాను సిద్ధం చేయాలి



స్థానిక అధికారులతో సమీక్ష చేస్తున్న అదనపు కలెక్టర్

కేతేపల్లి, జనవరి 18: పార్లమెంట్ ఎన్నికలతో పాటు వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నికకు సంబంధించి ఓటరు జాబితాను సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. ఓటరు జాబితా రూపకల్పనపై గురువారం కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదుకు అర్హులన్నారు. ఫారం-6 ద్వారా ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలకు ఓటరుగా నమోదైన వారు కూడా కొత్త ఫారం 18 ద్వారా ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2020నాటికి డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఓటుహక్కు నమోదుపై గ్రామాల్లో విరివిగా ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎన్ మదుసూదన్‌రెడ్డి, డీటీ దివ్య, ఆర్ఐ రాజేశ్వరీ, సైదిరెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్ స్టాంప్స్ ప్రదర్శన

రామగిరి : నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో పోస్టల్ స్టాంప్స్‌పై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోస్టల్ స్టాంపుల చరిత్రను వివరించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మౌంట్ లిటరస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ తార, తపాలా శాఖ అధికారులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్‌పై కక్ష చర్యలు తగదు

జాతీయ మాల మహానాడు స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు

నల్లగొండ టౌన్, జనవరి 18 : కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని నిలబెట్టిన అద్దంకి దయాకర్‌పై కక్ష సాధింపు చర్యలు తగదని జాతీయ మాల మహానాడు స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలందిస్తూ పార్టీలో తనదైన శైలిలో పనిచేసి పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోని మాలలను ఏకతాటిపైకి తెచ్చి ఆయా జిల్లాల ముఖ్యులతో చర్చించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రమించిన అద్దంకి దయాకర్‌కు మొండిచేయి చూపడం పార్టీకి తగదన్నారు. సొంత నియోజకవర్గం తుంగతుర్తిని చివరి నిమిషంలో వేరొకరికి ఇచ్చినా పార్టీ నిబంధనలకు లోబడి పనిచేసి తుంగతుర్తితో పాటు అటు రాష్ట్రంలో పార్టీ గెలుపు కోసం దయాకర్ ప్రయత్నం చేశాడన్నారు. అలాంటి వ్యక్తికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఖరారు చేసి చివరి నిమిషంలో మరొకరికి కట్టబెట్టడం సరికాదన్నారు. సమావేశంలో మహానాడు జిల్లా అధ్యక్షుడు బోగరి విజయకుమార్, మునుగోడు మండల అధ్యక్షుడు చలిచీమల యాదగిరి, సురేష్, చింతపల్లి సునీల్, అద్దంకి అవినాష్, సుధాకర్, వెంకట్, మీసాల, అంజి, అశోక్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోలి సైదులు

ఉమ్మడి జిల్లా బీజేపీ సారథుల నియామకం

భువనగిరి టౌన్/రామగిరి, జనవరి 18: యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా పాశం భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసి అతడికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. బాల్యం నుంచి ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్‌గా, విద్యార్థి దశలో ఏబీవీపీ కార్యకర్తగా పని చేసిన ఆయన బీజేపీలోనూ క్రియాశీల నాయకుడిగా పలువురి మన్ననలు పొందారు. ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థి సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా గెలుపొందిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా 4 సంవత్సరాలు పని చేశారు. బీఎంఎస్ జిల్లా ఉమ్మడి జిల్లా సంఘటనా కార్యదర్శిగా పని చేస్తూ పలు కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1997లో బీజేపీ ప18టౌన్ బియన్‌జి 8 (పాశం భాస్కర్) ట్టణ అధ్యక్షుడిగా కొనసాగిన ఆయన 2000-05 వరకు భువనగిరి మునిసిపల్ కౌన్సిలర్‌గా కొనసాగారు. 2006 నుంచి 2010 వరకు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా 2010 నుంచి 2014 వరకు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా పని చేసిన ఆయన ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అలాగే కర్ణాటకా అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓ అసెంబ్లీ నియోకవర్గానికి ఇంచార్జీగా పని చేశారు. భువనగిరి పట్టణానికి చెందిన భాస్కర్ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడు కావడం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ బాణా సంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని పార్టీ పటిష్ఠత, ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బీజేపి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా నాగం వర్షిత్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన శ్రీధర్‌రెడ్డి పదవికాలం ముగిసింది. దీంతో రాష్ట్ర పార్టీ నిర్ణయం తీసుకుంది.



పాశం భాస్కర్

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



చిట్యాలలో ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

చిట్యాల, జనవరి 18 : పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని, లక్ష్య కార్యక్రమాన్ని అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. గురువారం చిట్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను, భవిత కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రాథమికక పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, విద్యార్థులకు చదవడం, రాయడం, గణిత ప్రక్రియలను నేర్పాలన్నారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, స్లీవమ్మ, భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు గీత పాల్గొన్నారు.


ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నల్గొండ టౌన్, జనవరి 18 : ట్రాన్స్‌కోలో జూనియర్ లైన్‌మన్లు, ఆర్టిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేమూరి వెంకటేశ్వర్లు, సాయిబాబా తెలిపారు. గురువారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 రీజినల్ కార్యాలయంలో టీఎల్అండ్ఎస్ఎస్ ట్రాన్స్‌కో సర్వసభసమావేశాన్ని రీజినల్ సెక్రటరీ వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. కింది స్థాయి ఉద్యోగులపై అధికారులు పెడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కోలో నూతనంగా జూనియర్ లైన్‌మన్‌గా నియమించబడ్డ 100మంది 1104 యూనియన్‌లో చేరారు. అనంతరం టీఎస్ ట్రాన్స్‌కో రీజినల్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా జీ నాగరాజు, అధ్యక్షుడిగా ఎండీ షెముల్లా భేగ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డీ రమేష్, అదనపు కార్యదర్శిగా బీ రమేష్, కోశాధికారిగా ఎస్ లావణ్యలను ఎన్నుకున్నారు.

తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్



ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నల్లగొండలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కసిరెడ్డి శేఖర్‌రెడ్డి

సాంకేతిక పరిజ్ఞానంపై
తాపీ కార్మికులకు ఉచిత శిక్షణ




శిక్షణ పొందుతున్న తాపీ కార్మికులు

నల్లగొండ రూరల్, జనవరి 18: గ్రామీణ ప్రాంతాల్లోని భవన నిర్మాణ కార్మికులకు కార్మికులకు ఎన్ఏసీ(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ఆధ్వర్యంలో కార్మిక శాఖ సహకారంతో సాంకేతిక పరిజ్ఞానంపై తాపీ కార్మికులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్ఏసీ కోఆర్డినేటర్ రమేష్ తెలిపారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని దండెంపల్లి గ్రామంలో ఎన్ఏసీ ఆధ్వర్యంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న రెండో బ్యాచ్ శిక్షణ ముగింపు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వృత్తిలో మరింత నైపుణ్యం కలిగి ఉండేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ ఉచితంగా ఇవ్వడంతో పాటు 15రోజుల శిక్షణ కాలంలో రోజుకు రూ.300తో పాటు, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. శిక్షణ ముగిసిన అనంతర వారికి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ ఎం. నాగరాజు, జి. రమేష్, వెంకన్న, కాశి, ఎం. గిరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు మళ్లీ మోక్షం

● భూసేకరణ పూర్తి చేయాలని సీఎం ఆదేశం ● రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

చౌటుప్పల్, జనవరి 18: రీజనల్ రింగ్‌రోడ్(ఆర్ఆర్ఆర్) ప్రక్రియకు మళ్లీ మోక్షం కలిగింది. ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న ఈ ప్రక్రియ మళ్లీ వేగవంతం కానుంది. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో పూర్తిస్థాయి సహకారం లభించకపోవడంతో నిర్మాణ పనులకు సంబంధించిన ప్రక్రియ కొంతకాలంగా ఆగింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి సంబంధించిన కార్యకలాపాలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించడంతో ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి మళ్లీ కదలిక మొదలైంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో ఈ ప్రాంతం అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి.



రెండు భాగాలుగా..

రాజధాని హైదరాబాద్‌కు సమీపంలోని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ఔటర్ రింగ్‌రోడ్డుకు అనుసంధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాయి. సంగారెడ్డి నుంచి చేవెళ్ల వరకు 347.85 కిలోమీటర్ల మేర నిర్మించ తలపెట్టిన ఈ రోడ్డు నిర్మాణాన్ని రెండు భాగాలుగా విభజించారు. సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 158.65 కిలోమీటర్లు ఉత్తర భాగంగా, చౌటుప్పల్ నుంచి షాద్‌నగర్ మీదుగా సంగారెడ్డి వరకు 189.20కిలోమీటర్ల దక్షిణ భాగంగా నిర్మించాలని నిర్ణయించారు. ఉత్తరభాగం నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆ రహదారికి జాతీయ రహదారి హోదా ప్రకటించింది. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే 80శాతం భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. మిగితా 20శాతం భూసేకరణ ప్రక్రియ జరగాల్సి ఉంది. దీనికి సంబంధించి భువనగిరి తదితర ప్రాంతాలకు చెందిన రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి రైతుల ఇబ్బందులు తెలుసుకొని సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అప్పట్లో ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో ఆర్ఆర్ఆర్ ప్రక్రియ పడకేసినట్లయింది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన భూసేకరణతో పాటు, రోడ్డు నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద జమ చేయాల్సిన నిధులు జమ చేయకపోవ డంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య దూరం పెరిగి రోడ్డు నిర్మాణ ప్రక్రియకు ఆటంకంగా మారింది.

ముఖ్యమంత్రి ప్రకటనతో మళ్లీ కదలిక

ఇన్నాళ్లు స్తబ్దతగా ఉన్న ఆర్ఆర్ఆర్ నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంతో ఆర్ఆర్ఆర్ ప్రక్రియకు సంబంధించి మళ్లీ కదలిక మొదలైంది. మూడు నెలల్లో భూసేకరణ పూర్తి చేయాలని సీఎం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు వెచ్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దీంతో అధికార యంత్రాంగం మళ్లీ తన పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన రైతులు వేసిన కేసుల వివరాల సైతం సేకరించే పనిలో అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి సాంకేతికంగా, న్యాయ పరంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యలపై అధికారులు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సేకరించి పనిలో అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తుంది.

ఖర్చు ఎవరు భరించాలి

రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కొత్త కొత్త అంశాలు తెరపైకి వస్తున్నాయి. రోడ్డు నిర్మాణ ప్రక్రియకు ఇది కూడా మరో పీటముడిగా తయారవుతోంది. ఉత్తర భాగంలో నిర్మించే తలపెట్టిన 158 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి 4600 ఎకరాల భూమి సేకరణ చేయాల్సి ఉంది. భూ సేకరణకు సంబంధించిన ఈ మార్గంలో ఉన్న కేబు ల్, పైపులైన్లను తొలగించాల్సిన అవసరముంది. రహదారిపైఉన్న విద్యుత్తు లైన్‌లు, కేబుల్, టెలికం వైర్లు వంటి వాటిని తరలించేందుకు సుమారుగా రూ.363 కోట్ల ఖర్చు అవుతుందని అధికార యంత్రాంగం అంచనా వేసింది. ఈ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కేంద్రం కోరింది. కేంద్ర ప్రభుత్వమే భరించాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే భూసేకరణ వ్యయంలో 50శాతం ఖర్చు భరిస్తున్నందున దీనికి సంబంధించిన అదనపు భారాన్ని తాము భరించలేమని గత ప్రభుత్వం వెల్లడించింది. దీంతో సమస్య కొలిక్కి రాకుండా పెండింగ్ పడింది.

దక్షిణ భాగం రోడ్డు

సంగారెడ్డి నుంచి చేవెళ్ల వరకు రెండు భాగాలుగా నిర్మిస్తున్న రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఉత్తరభాగం నిర్మాణానికి సంబంధించి సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు నిర్మించే రోడ్డు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. కాగా చౌటుప్పల్ నుంచి చేవెళ్ల మీదుగా సంగారెడ్డి వరకు వరకు దక్షిణ భాగం రోడ్డు నిర్మాణం ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. 189.20 కిలోమీటర్ల మేర దక్షిణ భాగం రోడ్డును నిర్మించనున్నారు. దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి సంబంధించి రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణ బాధ్యతలు చూస్తున్న కన్సల్టెన్సీ సంస్థ ఇప్పటికే డీపీఆర్ రూపొందించింది. దీనిని సదరు సంస్థ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించింది. ఈ డిపిఆర్‌ను పరిశీలించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపాయి. దక్షిణ భాగం నిర్మాణానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పూర్తిస్థాయిలో చర్చలు జరిగి డీపీఆర్‌కు అధికారికంగా ఆమోదముద్ర వేస్తే దక్షిణ భాగం పనులు కూడా ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

తల్లిదండ్రులు మందలించారని బలవన్మరణం

● రైలుకింద పడి ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

● యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఘటన

బీబీనగర్, జనవరి 18: సరిగా చదువుకోవడం లేదని తల్లిదండ్రులు మందలించటంతో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ యుగంధర్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీబీనగర్‌కు చెందిన గుర్రం లక్ష్మారెడ్డి వృత్తిరీత్యా డ్రైవర్ కాగా, చిన్న కుమార్తె మేఘనారెడ్డి(19) హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కుమార్తె సరిగా చదవడం లేదని తల్లిదండ్రులు ఇటీవల ఆమెను మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన మేఘన బుధవారం రాత్రి ఏడు గంటల సమయంలో బేకరీకి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. చీకటి పడుతున్నా తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం బీబీనగర్ -ఘట్కేసర్ రైల్వేస్టేషన్ల మార్గమధ్యలో 225/30-32 మైలురాయి వద్ద దిగువ మెయిన్ లైన్ పట్టాలపై తీవ్ర గాయాలతో పడి ఉన్న గుర్తుతెలియని యువతి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు భువనగిరి ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచిన యువతి మృతదేహాన్ని చూసిన తండ్రి తమ కుమార్తెగా గుర్తించారు. సరిగా చదవడం లేదని మందలించామని, దాంతో ఈ అఘాయిత్యానికి పాల్పడిందని రైల్వే పోలీసులకు రోదిస్తూ చెప్పాడు. మేఘనారెడ్డి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



మేఘనారెడ్డి(ఫైల్)

హామీలను వెంటనే అమలు చేయాలి

చండూరు రూరల్, జనవరి18: తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బండా శ్రీశైలం అన్నారు. నల్లగొండ జిల్లా చండూరు మండలం నెర్మట గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైనందున ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఇంటికి పంపారన్నారు. చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూనిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం, ఆర్అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలు అభయ హస్తం దరఖాస్తులు చేసుకున్నారని, ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి, ఇండ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, కొత్తపల్లి నరసింహ, చిట్టిమల్ల లింగయ్య, అంతిరెడ్డి, ఈరటి వెంకటయ్య, మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ గౌడ్, ఈరగట్ల స్వామి, గణేష్, బురకల అంజయ్య, జంగయ్య, వెంకన్న, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండా శ్రీశైలం

రంగురాళ్ల దందా వ్యాపారుల బైండోవర్



పోలీస్‌స్టేషన్‌లో రంగురాళ్ల దందా వ్యాపారులు

అడవిదేవులపల్లి, జనవరి 18: రంగరాళ్లను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు సిబ్బంది హెచ్చరించారు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని ముదిమాణిక్యం గ్రామ శివారులో గల కృష్ణానదిలో కొందరు రంగురాళ్లను అక్రమ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా వైనంపై 'గుట్టుగా రంగురాళ్ల దందా' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. రంగురాళ్ల వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్న ముగ్గురిని పోలీసులు తహసీల్దార్ సురేష్‌కుమార్ ఎదుట గురువారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ జిలాని మాట్లాడుతూ మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వర్లు, కొమ్ము మల్లయ్య, తుమ్మల కొండలు ముదిమాణిక్యం గ్రామ పక్కన ప్రవహిస్తున్న కృష్ణానది నుంచి రంగురాళ్లను సేకరించి వాటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలతో వారిని తహసీల్దార్ ఎదుట రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్‌ను అతిక్రమించి మరోసారి రంగరాళ్లను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాశీ విశ్వేశ్వరాలయంలో చోరీ



హుండీని పరిశీలిస్తున్న ఎస్‌ఐ యుగందర్‌గౌడ్

బీబీనగర్, జనవరి 18: యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని జైనపల్లి గ్రామ కాశీ విశ్వేశ్వరాలయంలో గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఆలయంలోని హుండీని పగులగొట్టి నగదుతో పాటు రెండు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ యుగందర్ గౌడ్ సిబ్బందితో కలిసి గురువారం ఆలయాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యను చంపిన భర్తకు జీవితఖైదు

సూర్యాపేటలీగల్, జనవరి 18: భార్యను చంపిన భర్తకు జీవితఖైదు విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి జి. రాజగోపాల్ గురువారం తీర్పు చెప్పారు. నూతనకల్ మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన రాగిరి లింగయ్య వృత్తిరీత్యా ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. 2015 జనవరి 31వ తేదీన హుజూర్‌నగర్ మండలం లక్కవరం గ్రామానికి చెందిన బొమ్మగాని సైదులు తన కుమార్తె లావణ్యను లింగయ్యకు ఇచ్చి వివాహం చేశాడు. వివాహ సమయంలో 10తులాల బంగారం, రూ.4.50 లక్షలను నగదుగా ఇచ్చారు. ఇదే సమయంలో లింగయ్య అక్క కూతురి కుటుంబంలో ఏర్పడిన మనస్పర్థలు విడాకులకు దారితీసింది. అప్పటినుంచి లావణ్య(వనజ)ను అదనపు కట్నం కోసం వేధిస్తూ మానసిక, శారీరక హింసలు పెడుతున్న క్రమంలో 2016 జూన్ 22వతేదీన లావణ్యపై లింగయ్య, ఆయన తల్లి రాగిరి సోరమ్మ దాడి చేశారు. ఈ దాడిలో లావణ్య మృతిచెందింది. పోలుమల్ల గ్రామానికి చెందిన సైదులు బంధువైన ఉపేందర్ ద్వారా మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న లావణ్య తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ. ఎంజేబాజి కేసునమోదు చేశారు. సీఐ డి. లక్ష్మణ్ నిందితులపై అభియోగపత్రం దాఖలు చేశారు. 14మంది సాక్షులను విచారించిన కోర్టు నిందితుడు రాగిరి లింగయ్యకు జీవితఖైదుతో పాటు రూ. 5వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ప్రకటించింది. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య కేసును వాదించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

పెన్‌పహాడ్, జనవరి 18: చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని ధర్మాపురంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ వెంకన్నగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యడ్ల ముత్తయ్య(50) అదే గ్రామానికి చెందిన గాయం నర్సిరెడ్డి వద్ద మూడు సంవత్సరాల నుంచి పాలేరుగా పనిచేస్తున్నాడు. గేదెలను మేపటానికి ప్రతిరోజూ గ్రామ శివారుకు వెళ్లాడు. రోజుమాదిరిగానే బుధవారం కూడా గేదెలు మేపుకొని, వాటికి నీళ్ల తాపడానికి గ్రామ సమీపంలో ఉన్న మద్దిరామక్క చెరువుకు గేదెలను తోలుకెళ్లాడు. సాయంత్రం సుమారుగా ఆరుగంటల సమయంలో యాజమాని ఇంటికి గేదెలు చేరుకోగా, వాటి వెంట ముత్తయ్య రాలేదు. ఆతని కోసం తెలిసిన ప్రదేశాలు, వ్యక్తుల వద్ద ఆరా తీసినా అతడి సమాచారం లభించలేదు. గురువారం మధ్యాహ్నం ముత్తయ్య కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి మద్దిరామక్క చెరువులో గాలించారు. ఆ చెరువులో ముత్తయ్య విగతజీవిగా నీటిపై తేలియాడుతూ కన్పించాడు. నీళ్ల తాగడానికి చెరువు లోపలకి వెళ్లిన గేదెలు బయటకు రాకపోవడంతో వాటిని బయటికి పంపే ప్రయత్నంలో చెరువులోకి వెళ్లిన ముత్తయ్య ప్రమాదశాత్తు చెరువులో గతంలో మిషన్ భగీరథ పనులలో భాగంగా చెరువులో తీసిన పెద్ద గుంతలో పడిపోయాడు. గుంతలో ఉన్న నాచు కాలికి చుట్టుకొని ఊపిరి ఆడలేక ప్రాణాలు కోల్పోయాడు. ముత్తయ్యకు ఈత రాదని కుటుంబసభ్యులు తెలిపారు. ముత్తయ్య అవివాహితుడు. ముత్తయ్య తమ్ముడు బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు

మేళ్లచెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రానికి చెందిన సంపత్ శివ(30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... అవివాహితుడైన తన సోదరుడు ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడని శివ సోదరుడు గోపి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

కోదాడ రూరల్, చివ్వెంల, జనవరి 18: సూర్యాపేట జిల్లా కోదాడ, చివ్వెంల మండలాల్లో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. కోదాడ మండలంలోని దోరకుంట, నల్లబండగూడెం గ్రామాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. విజయవాడ నుంచి హైద్రాబాద్ వెళ్తున్న కారు మండలంలోని దోరకుంట వద్ద గురువారం ఉదయం అదుపు తప్పి బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మరో ప్రమాదంలో జగ్గయ్యపేట నుంచి కోదాడ వస్తున్న బైక్ నల్లబండగూడెం గ్రామం వద్ద ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళతో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వీరిని 108 ద్వారా కోదాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరు జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు. అదేవిధంగా చివ్వెంల మండల పరిధిలోని గుంజలూరు గ్రామ స్టేజీ వద్ద జాతీయ రహదారిపై విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న లారీని వెనుక వైపుగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు మరొకరికి గాయాలయ్యాయి. ప్రమాదంతో ట్రాఫిక్ జాం అయింది. ఎస్‌ఐ. విష్ణుమూర్తి చేరుకొని సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన లారీ, కారును పక్కకు తీయించారు. ఇదే విషయమై ఎస్‌ఐని వివరణ కోరగా ప్రమాద విషయంలో ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

కాల్వలు పూర్తికావు.. నీళ్లు పారవు

● కొనసాగుతున్న మూసీ కాల్వల ఆధునికీకరణ ● రూ.65.55 కోట్లు మంజూరు చేసిన గత ప్రభుత్వం ● కుడి కాల్వ 80శాతం, ఎడమ కాల్వ 70శాతం పనులు పూర్తి ● పనులకు వర్షాలు అడ్డంకిగా కాంట్రాక్టర్ల సాకు



పిల్లలమర్రి గ్రామ 18వ డిస్ట్రి బ్యూటరీ వద్ద తూము సరిచేస్తున్న రైతులు



అంజనాపురి కాలనీ ప్రాంతంలోని లైనింగ్ వద్ద మొలిచిన పిచ్చిమొక్కలు

సూర్యాపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పరిధిలో మూసీ కాల్వల ఆధునికీకరణ పనులు ముందుకు సాగడం లేదు. ఐదేళ్ల క్రితం ప్రారంభించిన పనులు నేటికీ పూర్తికాలేదు. మూసీ ఆయకట్టు పరిధిలో 40వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం లక్ష్యం కాగా, ఆరు దశాబ్దాలుగా మూసీ కుడి, ఎడమ కాల్వల కింద 33వేల ఎకరాలు సాగవుతోంది. కాల్వల లైనింగ్ దెబ్బతినడం, షెట్టర్లు లేకపోవడంతో నీరు వృథాగా పోతుండటంతో ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందడంలేదు. మూసీ కాల్వల ఆధునికీకరణకు 2018సంవత్సరంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.65.55 కోట్లతో పనులు చేసేందుకు టెండర్లు పిలవగా, ఎంఆర్‌జీఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. పనులు ప్రారంభమైనప్పటి నుంచి వర్షాలు కురవడంతో ఎగువప్రాంతం నుంచి మూసీ ప్రాజెక్టు వరద నీరు భారీగా చేరుతుంది. ఎగువనుంచి నీరు రావడంతో కుడి, ఎడమ కాల్వల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. పనుల నిర్వహణకు కాల్వల్లో నీరు ప్రవహిస్తుందని చెబుతూ కాంట్రాక్టర్లు మరింత జాప్యం చేశారు. 2021లో ఆధునికీకరణ పూర్తి చేయాల్సి ఉండగా, వర్షాలు ఉండడంతో పనులు చేయలేకపోతున్నామని కాంట్రాక్టర్లు ఆరు నెలల గడువు కోరారు. ఆ గడువు దాటగా, 2023 డిసెంబరు వరకు మళ్లీ పొడిగించారు. ఇప్పటివరకు రూ.45కోట్లు ఖర్చుచేసినా 70శాతం పనులు పూర్తి కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. పనులు ఆలస్యం కాగా, నిధుల మంజూరులోనూ ఆలస్యమైంది.

ఇప్పటివరకు పూర్తయిన పనులు

కుడి కాల్వ మొత్తం పొడవు 55.89 కిలోమీటర్లు కాగా, అందులో 39కిలోమీటర్ల వరకు లైనింగ్ పూర్తిచేశారు. 35కిలోమీటర్ల మేర కట్టలను 8అడుగుల వెడల్పు చేసి మట్టి పోశారు. బెడ్ లైనింగ్ 29కిలోమీటర్లు పూర్తిచేశారు. పక్క లైనింగ్ 39కిలోమీటర్లు, ఆర్‌ఆర్, సీసీ లైనింగ్ వేశారు. కుడి కాల్వ 80శాతం పనులు పూర్తికాగా, 20శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఎడమ కాల్వ పనుల తీరు కూడా అదే తరహాలో ఉంది. మొత్తం 30కిలోమీటర్ల పొడవు ఉన్న ఎడమకాల్వ ఇప్పటి వరకు 24కిలో మీటర్ల వరకు లైనింగ్ పనులు పూర్తి చేశారు. కట్టలకు ఇరువైపులా నీరు లీకేజీ కాకుండా ఆర్‌ఆర్‌సీసీ లైనింగ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా కొన్ని తూములకు షెట్టర్లు బిగించలేదు. మూసీ ప్రాజెక్టు నుంచి కాల్వల వెంట వంతెనలు ఉన్న చోట బ్యాకింగ్(మనుషులు నడవడానికి) పనులు (కాల్వలకు ఇరువైపులా) చేయాల్సి ఉండగా పిల్లలమర్రి నుంచి శాంతినగర్ వరకు మాత్రమే పూర్తి చేశారు. ఇంకా మూసీ ప్రాజెక్టు నుంచి పిల్లలమర్రి వరకు పనులు చేయాల్సి ఉంది. ఎడమ కాల్వ వైపు మరో ఆరు కిలోమీటర్ల మేర లైనింగ్, సీసీ పనులు చేయాల్సి ఉంది.

చేయాల్సిన పనులు ఇవే..

నాలుగు టీఎంసీల సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టుకు సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో ఉన్న కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు నీరు సరఫరా అవుతుంది. కుడి కాల్వ 55.89 కిలోమీటర్లు, ఎడమకాల్వ 30కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కుడి కాల్వ వైపు 40కిలోమీటర్ల దూరం, ఎడమ కాల్వ వైపు 30కిలోమీటర్ల దూరం ఆధునికీకరణ పనులు చేయాల్సి ఉంది. ఈ పనులు 2021 నవంబరులో పూర్తి చేయాలని తేల్చిచెప్పిన ప్రభుత్వం ఇందుకోసం అప్పుడే రూ.65.55 కోట్లు విడుదల చేసింది. భారీ వర్షాలతో కాల్వలకు నీటి విడుదల చేయడంతో పనులు సాఫీగా సాగడంలేదని, అదనపు ఖర్చులు చేయాల్సి వస్తుందని కాంట్రాక్టర్లు వాపోయారు. పలుమార్లు పనులు ముందుకు సాగకపోవడంతో 2022 డిసెంబరు వరకు ప్రభుత్వం సడలింపు ఇచ్చింది. ఆర్‌ఆర్ లైనింగ్, సీసీ లైనింగ్, డిస్ట్రిబ్యూటర్ల వద్ద తూముల ఏర్పాటు, ప్రాజెక్టు చుట్టూ కట్టల మరమ్మతులు చేయాల్సి ఉంది. అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ల అలసత్వంతో ఐదేళ్ల నుంచి పనులు ముందుకు సాగడంలేదు.

నాణ్యతా ప్రమాణాలపై విమర్శలు

పనుల్లో నాణ్యత ప్రమాణాలు కూడా పాటించడంలేదని, నాసిరకంగా పనులు ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఎడమ కాల్వ లైనింగ్‌కు రాయి కట్టుబడి కట్టిపైన మట్టి పోసి వదిలేశారు. వాస్తవానికి సిమెంట్‌తో ప్లాస్టింగ్ చేయాల్సి ఉండగా, అలా చేయకపోవడంతో పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగి మళ్లీ యథావిధిగానే కనబడుతున్నాయి. లైనింగ్ పనుల్లో సిమెంట్ ఎక్కువ వాడకపోవడంతో లైనింగ్ తొందరగా దెబ్బతిన అవకాశముందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాతి కట్టుబడిలో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని విమర్శలు వస్తున్నాయి. తూముల మరమ్మతు పనులు సరిగ్గా చేయలేదని, షెట్టర్లు పనిచేయడం లేదని కాల్వ సమీప రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల తీరుతో కాంట్రాక్టర్ల జాప్యం

ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు రావడంలేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అధికారులు సహకరించడంలేదని దీంతో పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాల్వల ఆధునికీకరణ పనులు పూర్తి కాకపోవడంతో సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలోని కేటీఅన్నారం, కుప్పిరెడ్డిగూడెం, కాసరాబాద, సర్కిల్‌పేట, చివ్వెంల మండలం దురాజ్‌పల్లి, పెన్‌పహాడ్ మండలం అనాజీపురంతో పాటు పలు గ్రామాలకు సాగునీరు అందడం కష్టంగా మారింది. అక్కడి అక్కడ లైనింగ్, డిస్ట్రిబ్యూటర్ల వద్ద షట్టర్లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోందని రైతులు వాపోతున్నారు.

ఈ యాసంగి కష్టమే



మూసీ ప్రాజెక్టులో నీరు ఉన్న కూడా చివరి భూములకు నీరు అందడంలేదు. పిల్లలమర్రి నుంచి కాసరబాదకు నీరు రావాలంటే అవస్థలు పడుతున్నాం. తూములకు షెట్టర్లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో చివరి భూములకు నీరు అందడంలేదు. ప్రభుత్వం స్పందించి చివరి భూములకు సాగు నీరందేలా చూడాలి.

● శ్రీనివాస్‌రెడ్డి రైతు, సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం కాసరబాద గ్రామం.

మార్చి మొదటి వారంలో పనులు ప్రారంభం

అకాల వర్షాలతో కాల్వల ఆధునికీకరణ పనుల్లో జాప్యం జరిగింది. ఇప్పటివరకు 70శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు త్వరలో పూర్తి చేయిస్తాం. చివరి భూములకు నీరు అందేలా పర్యవేక్షిస్తున్నాం. పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు ఆపేస్తాం.

● బద్రునాయక్, ఈఈ

వైభవంగా నిత్యవిధి కైంకర్యాలు



లక్ష్మీనృసింహులకు గజవాహన సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి 18: ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం నిత్యవిధి కైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు గర్భాలయంలోని స్వయంభువులను పంచామృతాలతో అభిషేకించి, అర్చించారు. ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి, గజవాహన సేవలో తీర్చిదిద్ది సేవోత్సవం నిర్వహించారు. విశ్వక్సేనుడికి తొలి పూజలతో నిత్యకల్యాణోత్సవం నిర్వహించారు. ముందుగా సుదర్శన శతకపఠనంతో హోమ పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యపూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. 10వేల మందికి పైగా భక్తులు నృసింహుడిని దర్శించుకోగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.44,21,170 ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

బస్సుల కోసం భక్తుల పాట్లు

యాదగిరీశుడి దర్శనానికి పెద్దసంఖ్యలో వస్తున్న భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులను దేవస్థానం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా కొండపైకి, కొండకిందకు చేరవేస్తోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపాల్సి ఉండగా, అరకొర బస్సులతో ఇబ్బంది పడుతున్నామని భక్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణించాల్సి వస్తోందని, ఒక్కో బస్సులో 30 మంది ప్రయాణించాల్సి ఉండగా రద్దీ కారణంగా 50 నుంచి 60 మంది ప్రయాణం చేయాల్సి వస్తోందని భక్తులు తెలిపారు. ఘాట్‌రోడ్‌లో తిరుగుతున్న బస్సులకు ఏదైనా ప్రమాదం వాటిల్లితే బాధ్యులు ఎవరని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా గురువారం కొండపైన ఆర్టీసీ బస్‌బే వద్ద భక్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రద్దీకి తగ్గట్టుగా బస్సులు నడపడం లేదని, వచ్చిన బస్సులు కూడా ప్లాట్‌ఫాంపై కాకుండా రోడ్డుపైన నిలబెడుతున్నారని, దీంతో పాటు ప్లాట్‌ఫాం నుంచి రోడ్డుపైకి వచ్చి బస్సుల్లో ఎక్కేందుకు నానాతంటాలు పడాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. పరిమితికి మించి బస్సుల్లో ఎక్కాల్సి రావడంతో భక్తుల మధ్య తగాదాలు, ఘర్షణలు తలెత్తున్నాయని, రద్దీకి తగ్గట్టుగా బస్సులను నడపాలని భక్తులు కోరుతున్నారు.



పరిమితికి మించి బస్సులోనికి ఎక్కుతున్న భక్తులు

రహదారిపై వాహనాల రద్దీ సాధారణం

చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ మునిసిపాలిటీ, జనవరి 18: సంక్రాంతి పండుగ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై విపరీతంగా కనిపించిన రద్దీ గురువారం నాటికి సాధారణ స్థితికి చేరుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా మీదుగా హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి నెం.163, నల్లగొండ జిల్లా మీదుగా హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న టోల్‌గేట్ల వద్ద వాహనాల రద్దీగా సాధారణంగా కనిపించింది. చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై గురువారం సంక్రాంతి పండుగ తిరుగు ప్రయాణ వాహనాలు పలుచబడ్డాయి. పండుగ కోసం హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లిన వాహనాల రద్దీ తిరుగు ప్రయాణంలో అంతగా కనిపించలేదు. మంగళ, బుధవారాలలో ఉన్న వాహనాల రద్దీ గురువారం నాటికి బాగా తగ్గింది. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు గురువారం సాధారణంగా కంటే 4 నుంచి 5 వేల వాహనాలు అదనంగా వెళ్లినట్టు జీఎమ్మార్ సంస్థ హైవే-65 ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి వరకు 50శాతం పై చిలుకు వాహనాలు హైదరాబాద్ కు చేరుకోగా, మిగిలిన వాహనాలు ఈ నెల 21వ తేదీ వరకు చేరుకుంటాయని తెలిపారు. జాతీయ రహదారిపై సంక్రాంతి వాహనాల రద్దీ తగ్గిందని, వాహనాలు తక్కువ సంఖ్యలో వెళుతుండటంతో, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేదని వివరించారు. గూడూరు టోల్ ప్లాజా వద్ద కూడా రద్దీ సాధారణంగానే ఉందని సిబ్బంది తెలిపారు.



చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద తగ్గిన వాహన రద్దీ

తిరుగు ప్రయాణానికి తప్పని తిప్పలు

సంక్రాంతి సెలవులు ముగియడంతో సాధారణ ప్రజలతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు గ్రామాల నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చౌటుప్పల్ చుట్టూ పక్కల మండలాల గ్రామాల ప్రజలు పండగకు సొంత గ్రామాలకు వచ్చి హైద్రాబాద్ వెళ్లడానికి చౌటుప్పల్ బస్టాండ్‌కు వచ్చారు. బస్సులు సరిపడ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. విజయవాడ వైపు నుంచి వచ్చె బస్సులు కూడా జనంతో నిండుగా వస్తుండడంతో చౌటుప్పల్‌లో బస్సులు నిలపకపోవడంతో అవస్థలు ఎదుర్కొన్నారు.

చెర్వుగట్టు ప్రధానార్చకుడికి అయోధ్యకు ఆహ్వానం



రామలింగేశ్వరశర్మ

నార్కట్‌పల్లి, జనవరి 18: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రధాన అర్చకుడు కరసేవకుడైన డాక్టర్ పోతులపాటి రామలింగేశ్వరశర్మకు అయోధ్యకు ఆహ్వానం వచ్చింది. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో రామ మందిర ప్రారంభం, బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర నిర్వాహకుల నుంచి గురువారం లేఖ అందింది. ఆలె నరేంద్ర ఆధ్వర్యంలో 1990లో జరిగిన బాబ్రీ మసీద్‌పై కరసేవకుల పోరాటంలో జిల్లా నుంచి వెళ్లిన ప్రముఖ కరసేవకుల్లో రామలింగేశ్వరశర్మ ఒకరు. దాదాపు 20రోజుల పాటు అయోధ్యకు వెళ్లి ఏడు రోజుల పాటు అక్కడి పోలీసుల నిర్బంధంలో ఉన్నారు. ఎట్టకేలకు తనకు అయోధ్య రామమందిర ప్రారంభం, బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠలో పాల్గొనే అవకాశం లభిస్తుందని తాను ఊహించలేదని, ఇది తన కరసేవకు దక్కిన గౌరవంగా రామలింగేశ్వరశర్మ పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లకు హాజరైన ఎమ్మెల్యేలు



ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకట్ నామినేషన్‌కు హాజరైన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

భువనగిరి రూరల్, భువనగిరి అర్బన్, జనవరి 18: ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ తరపున బల్మూరి వెంకట్, మహేశ్‌కుమార్‌గౌడ్‌లు నామినేషన్‌లు దాఖలు చేశారు. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి, మునుగోడు, దేవరకొండ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలునాయక్ పాల్గొన్నారు.

రూ.60వేల విలువైన మద్యం పట్టివేత

● గోవా నుంచి తెచ్చి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మిర్యాలగూడ, జనవరి 18: సుంకం చెల్లించకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎల్. మహేశ్వర్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలు తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రవీంద్రనగర్‌కాలనీకి చెందిన అన్నదమ్ములు పున్న శివ(25), పున్న రాకేశ్(27) గోవా నుంచి అక్రమంగా మద్యం తెచ్చి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ సిబ్బంది గురువారం ఉదయం వారి ఇంటిపై దాడి చేశారు. గోవా రాష్ట్రానికి చెందిన 45 మద్యం ఫుల్‌బాటిళ్లలో సిగ్నేచర్(4), బ్లెండర్‌స్ప్రైడ్(22), ఆన్టికుటీ బ్లూ(17), ఓల్డ్‌మంక్ రమ్(2) దొరికాయి. గోవాలో కంటే ఇక్కడ రెట్టింపు ధర ఉండడంతో అక్కడి మద్యాన్ని అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారు. పున్న రాకేశ్‌పై గతంలో నల్లగొండ, మిర్యాలగూడలలో రెండు కేసులు నమోదయ్యాయి. 2022 నవంబరులో మిర్యాలగూడలో నమోదైన కేసులో కారులో మద్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశారు. ఆ కారుని వేలం వేసినట్టు సీఐ తెలిపారు. అతనిపై రూ.2 లక్షల బైండోవర్ కేసు కూడా నమోదైందని అన్నారు. రాకేశ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు డి. రామకృష్ణ, ఎస్‌కె. పర్వీన్, వై. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న విద్యార్థులు

సంస్థాన్ నారాయణపురం, జనవరి 18: తమకు దొరికిన రూ.40 వేల నగదును పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నారు విద్యార్థులు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన ముత్యాలు మండలకేంద్రంలో బస్సు ఎక్కుతుండగా తన వద్ద ఉన్న రూ.40వేలు కిందపడ్డాయి. అదే సమయంలో సంస్థాన్‌నారాయణపురం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు బండారు రాకేష్, పగిళ్ల పవన్‌లకు దొరికాయి. ఆ నగదును వారు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ఎస్‌ఐ రామచేందర్‌గౌడ్‌కు అప్పగించారు. ఎస్‌ఐ చౌరస్తాలోని సీసీ కెమెరాలను పరిశీలించి డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి కొత్తగూడెం గ్రామానికి చెందిన ముత్యాలుగా గుర్తించి, బాధితుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి నగదు అందజేశారు. అదేవిధంగా తమకు దొరికిన డబ్బును నిజాయితీగా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన కళాశాల విద్యార్థులను ఎస్‌ఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నార్కట్‌పల్లి, జనవరి 18: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని నల్లగొండ ఫ్లైఓవర్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన చిక్కుళ్ల రమేశ్(34) నల్లగొండలోని కోర్టులో అటెండర్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే విధులు ముగించుకుని గురువారం రాత్రి బైక్‌పై నార్కట్‌పల్లికి వస్తున్నాడు. కాగా ఫ్లైఓవర్ సమీపంలోని ఓ హోటల్ వద్ద ముందుగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా ఆగడంతో బైక్‌పై వస్తున్న రమేశ్ ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రమేశ్‌కు భార్య, కొడుకు ఉన్నారు.

పెళ్లి కావడంలేదని జమ్మిచెట్టు వద్ద పూజలు

● అనుమానించి, పోలీసులకు ఫిర్యాదుచేసిన గ్రామస్థులు ● పోలీసులు సర్ది చెప్పడంతో సద్దుమనిగిన వివాదం

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 18: వివాహం కావడంలేదని ఓ తండ్రి తన కుమారుడికి జమ్మిచెట్టు వద్ద రాత్రి సమయంలో పూజలు చేయిస్తుండగా గ్రామస్థులు అభ్యంతరం చెప్పారు. బాధితులు, గ్రామస్థులు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూర్ గ్రామంలో కోకల సత్యనారాయణ తన కుమారుడు సందీప్‌కు వివాహం కావడంలేదని మరో ముగ్గురు వ్యక్తులు కలిసి కొద్ది రోజులుగా గ్రామ సమీపంలోని జమ్మిచెట్టు వద్ద తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పూజలు చేయిస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఇలా చేస్తున్నారేమోనని గ్రామస్థులు తీవ్రభయాందోళన చెందారు. గ్రామంలో నెల రోజుల వ్యవధిలో వివిధ కారణాలతో 12మంది మృతిచెందారు. గ్రామంలో ఎవరో క్షుద్ర పూజలు చేయిస్తున్నారని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామస్థులు గుట్టుచప్పుడు కాకుండా ఈనెల 15న పూజలు నిర్వహిస్తున్న జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజలు నిర్వహిస్తున్న ఐదుగురిలో గ్రామానికి చెందిన తండ్రీకుమారులు సత్యనారాయణ, సందీప్‌లను గుర్తించి పట్టుకున్నారు. మిగితా ముగ్గురు పరారీలో ఉన్నారు. ఈ నెల 16న గ్రామస్థులు స్థానిక గ్రామపంచాయతీకి రావాలని సత్యనారాయణ, సందీప్‌లను పిలిచారు. అందుకు వారు నిరాకరించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడి వివాహంకోసం పూజలు నిర్వహిస్తుంటే గ్రామస్థులు అక్రమంగా పట్టుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 18న గ్రామస్థులు సుమారు 100మంది స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు కలుగజేసుకుని ఇరు వర్గాలను శాంతింపజేశారు. ఈ విషయమై సీఐ మాట్లాడుతూ గ్రామంలో కోకల సత్యనారాయణ తన కుమారుడికి వివాహం కావడం లేదని బ్రాహ్మణులతో జమ్మిచెట్టు వద్ద పూజలు చేసుకుంటుంటే గ్రామస్థులు అనుమానంతో అడ్డుకున్నారని తెలిపారు. మూఢనమ్మకాలను నమ్మొద్దని సీఐ అన్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన గ్రామస్థులు

జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

● జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి



టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 18: జిల్లా సమగ్ర అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైనదని జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం 2024 టేబుల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యోగులతో పాటు అధికారులు జిల్లా అభివృద్ధి కోసం కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎస్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డితో పాటు బాలరాజురెడ్డి, యాకూబ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలి

● ఉప ముఖ్యమంత్రి భట్టిని కలిసిన ఎమ్మెల్యే బాలునాయక్



విక్రమార్కను కలిసి సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 18: దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, పెండ్లిపాకల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను గురువారం కలిసి శాలువాతో సన్మానించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల వివరాలు, పురోగతిని వివరించారు. గత ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేసిందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బాలునాయక్ పేర్కొన్నారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : భాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, జనవరి 18: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయా మండలాల ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు సంసిద్ధులుగా ఉండాలని సూచించారు. తెలంగాణభవన్‌లో ఈ నెల 22వ తేదీన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' నిరుపేదలకు వరం

మర్రిగూడ, జనవరి 18: కల్యాణలక్ష్మి పథకం నిరుపేదలకు వరమని నాంపల్లి జడ్పీటీసీ ఏవీరెడ్డి, ఎంపీపీ ఎడుదొడ్ల శ్వేతరవీందర్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండలంలోని తుంగపాడు, వడ్డేపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం వారు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవాసింగ్, ఎంపీడీవో శేషకుమార్, వైస్ ఎంపీపీ పానుగంటి రజనీవెంకన్నగౌడ్ పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ భూనిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి



విలేకరులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

దామరచర్ల, జనవరి 18: మండలంలోని వీర్లపాలెంలో నిర్మిస్తున్న యాదాద్రి పవర్‌ప్లాంట్ కింద భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు భూనిర్వాసితుల చట్టం ప్రకారం ప్లాంట్‌లో ఉద్యోగాలు, నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. గురువారం చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో మోదుగులతండా, కపురతండాలకు చెందిన సుమారు 200 కుటుంబాలకు చెందిన వారు భూములు, ఇళ్లు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం భూనిర్వాసిత కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన వారికి పవర్‌ప్లాంట్‌లో ప్రభుత్వ ఉద్యోగంతో పాటు 200 కుటుంబాలకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేసి ఆ కాలనీకి ఉచితంగా కరెంట్, నీటి సరఫరా అందించడంతో పాటు ఉపాధి కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామస్థులు రూపావత్ శివచరణ్‌నాయక్, రూపావత్ శంకర్‌నాయక్, విజయ్, సూర్యనాయక్, మునిలాల్‌నాయక్, శ్రీనివాస్, గుగులోతు నాగునాయక్, శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్

● జిల్లాలో ఎన్టీ రామారావు వర్ధంతి కార్యక్రమం

● విగ్రహాలు, చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలుగువారి ఆత్మ గౌరవ ప్రతీక ఎన్టీఆర్ అని పలువురు టీటీడీపీ జిల్లా నాయకులు కొనియాడారు. తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం, మహిళల సమాన హక్కుల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని పలు పట్టణాలు, మండలకేంద్రాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటానికి పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడని, ఆయన చేపట్టిన కార్యక్రమాలు తెలుగు ప్రజలు జీవితంలో ఒక మైలురాయిగా నిలిచిపోయాయన్నారు. ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ నిలిచిపోతారని, ఆయన ఆయన సాధనకు నెరవేర్చడానికి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆస్పత్రుల్లో రోగులకు, పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

● నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్లమెంట్ అధ్యక్షుడు కసిరెడ్డి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, హైదరాబాద్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ నిలిచిపోతారని అన్నారు. ఆయన బాటలో మాజీ సీఎం చంద్రబాబునాయుడు తెలుగు ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల మధుసూదన్‌రెడ్డి, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆకునూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి కూరెళ్ల విజయ్‌కుమార్, నాయకులు సిద్ధిక్, తేలు రవి, క్రాంతి, వెంకటయ్య పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని సాగర్‌రోడ్డులో గల ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మాభిమానాన్ని తట్టిలేపిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశాయని అన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, జడ్పీ మాజీ చైర్మన్ సీడీ రవికుమార్, టీటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నెల్లూరు దుర్గాప్రసాద్, పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు సాధినేని శ్రీనివాసరావు, అరుణ్‌కుమార్, రామావతారం, సురేష్, గంగాధర్, ముక్కెర అంజిబాబు, పోగుల సైదులుగౌడ్, రాములు, మాన్యానాయక్, నగేష్, వెంకన్న, రామాచారి, రసూల్, జానిమియా, సైదా పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

● నార్కట్‌పల్లిలో టీటీడీపీ భువనగిరి పార్లమెంట్ కార్యదర్శి లింగాల యాదయ్య నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చెన్నారపు సత్తయ్య, చింత రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● చండూరు, మునుగోడులో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు ఎర్రజెల్ల లింగయ్య, మక్కెన అప్పారావు, షరీఫ్, అంజయ్య, పాపయ్య, యాదయ్య, వేణుగోపాల్ రెడ్డి, బిక్షం, రాములు, లక్ష్మీనారాయణ, సత్తయ్య, నర్సింహ పాల్గొన్నారు.

● నిడమనూరులో మండల కేంద్రంలో సాగర్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముచ్చా అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మంద తిరుపతయ్య, వెంకన్న, నర్సింహారావు, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, సైదయ్య, శేఖర్‌చౌదరి, సత్తిబాబు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్)లో నందమూరి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మెరావత్ మునినాయక్ నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సపావత్ రంగాచౌహాన్, నరసింహ, సేవా, రమేష్, నవీన్,పాండు, రంగప్రభ, రంగసాయి, దస్రు, లింగయ్య పాల్గొన్నారు.

● వేములపల్లిలో టీడీపీ రాష్ట్ర నాయకులు జడ రాములుయాదవ్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జానిమియా, వేములపల్లి, మాడ్గులపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు జయంరాంచారి, షేక్ రసూల్, నాయకులు గుండెబోయిన మల్లయ్య, రాజు, అనంతరెడ్డి, రమేష్ నివాళులర్పించారు.



మిర్యాలగూడలో నివాళులర్పిస్తున్న నెల్లూరి దుర్గాప్రసాద్, నాయకులు

● చింతపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పల రమేష్, జిల్లా నేతలు కుకుడాల శ్రీనివాస్, కొమ్ము యాదయ్య, యాదగిరిచారి, రేణుకుంట్ల వెంకటేశ్వర్లు, యాదగిరి, సంతోష్ పాల్గొన్నారు.

● దేవరకొండలో టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు వస్కుల కృష్ణయ్య, కోటి అమరేందర్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గార్లపాటి శ్రీను, నాయకులు బ్రహ్మాచారి, సీతారాములు, సుమన్, మురళి, గార్లపాటి కృష్ణయ్య, దొడ్డి శ్రీను, సత్యం పాల్గొన్నారు.

● దామరచర్లలో సుమారు వెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి రాంరెడ్డి, రాములుయాదవ్, గోపి, మాన్యనాయక్, జాని, పంతుల్యనాయక్, సైదులు పాల్గొన్నారు.

● మర్రిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో బీసీసెల్ ప్రధాన కార్యదర్శి పగడాల లింగయ్య, నాయకులు పుప్పాల యాదయ్య పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తిరిగి పగడాల యాదయ్య టీడీపీలో చేరారు.

● కట్టంగూరు మండలంలోని చెర్వుఅన్నారంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కారదర్శ గద్దపాటి వెంకటేశ్వర్లు, దెండే సైదులు, మల్లయ్య, బీరప్ప, బిక్షం, రామస్వామి, సురేష్ పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాకుల అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ భువనగిరి పార్లమెంటరీ అధికార ప్రతినిధి నక్క రాంభనేష్, బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు దొమ్మాటి సైదులు, నాయకులు కృష్ణారెడ్డి, ఏడుకొండలు, నర్సింహ పాల్గొన్నారు.

● మాడ్గులపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు షేక్ రసూల్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.


● చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు బత్తుల వెంకటేష్‌గౌడ్, సీమ లింగయ్య, సత్తయ్య పాల్గొన్నారు.



నల్లగొండ పార్టీ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



మునుగోడులో నివాళులర్పిస్తున్న జక్కలి అయిలయ్య యాదవ్



దేవరకొండలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

బెల్ట్‌షాపుల నిషేధంపై మహిళల హర్షం

● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మునుగోడురూరల్, జనవరి 18: గ్రామాల్లో బెల్ట్‌షాపులను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నిషేధించడంపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. మునుగోడు మండల పరిధిలోని కొరటికల్ గ్రామ మహిళలు, బెల్ట్‌షాప్ నిర్మూలన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం బెల్టుషాపులకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్‌షాపులను నిషేధించడం వల్ల ప్రశాంతమైన వాతావరణం నెలకొందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో బెల్ట్‌షాపులను విచ్చలవిడిగా నిర్వహించడం వల్ల పలువురు మద్యానికి బానిసై నిత్యం ఆరోగ్యాన్ని పాడు చేసుకునేవారని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్‌షాపులు నిషేధించడం వల్ల యువకులు తాగుడు బందు చేసి తమ పనులకు పోతున్నారని వారు పేర్కొన్నారు. బెల్ట్‌షాపుల నిషేధంలో ఎమ్మెల్యే వేసిన బెల్ట్‌షాపుల నిర్మూలన కమిటీ క్రియాశీలకంగా పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో డీసీబీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మునుగోడు ఎస్ఐ వెంకటేశ్వర్లు మాజీ సర్పంచ్ అయితగోని బుచ్చయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, కొంపల్లి సర్పంచ్ జాల వెంకన్నయాదవ్, సైదులు గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కొరటికల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

రేషన్‌డీలర్లు సమయపాలన పాటించాలి

వేములపల్లి, జనవరి 18: రేషన్ డీలర్లు సమయపాలన పాటించి లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేషన్‌కార్డులో ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడు ఈకేవైసీ చేసుకునేలా చూడాల్సిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు తన దృష్టికి వస్తే వారిని తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ నిర్మలాదేవి, ఆర్ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన రెడ్డి, సిబ్బంది జైపాల్‌రెడ్డి, డీలర్లు వెంకటయ్య, సుధాకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, కృష్ణమూర్తి పాండురంగయ్య, సంతోష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

కనగల్: పద్దెనిమిది ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జ్యోతి కోరారు. గురువారం ఓటరు నమోదుపై తన కార్యాలయంలో బీఎల్‌వోలకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 20, 21 తేదీల్లో గ్రామాల్లో నిర్వహించే ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలన్నారు. ఫాం 6 తప్పులు లేకుండా సరిచూడాలని బీఎల్‌వోలకు సూచించారు. సమావేశంలో డీటీ పార్వతమ్మ, ఎస్ఏ రాములు, ఆర్ఐ ప్రసాద్, యాదయ్య, సర్వేయర్ శ్రీనివాస్, సీవో రాజు పాల్గొన్నారు.

నేడు పులిచర్లకు కేంద్ర మంత్రి రాక

పెద్దవూర, జనవరి 18: పెద్దవూర మండంలోని పులిచర్ల గ్రామానికి శుక్రవారం కేంద్రమంత్రి మహేంద్రనాథ్‌పాండే రానున్నారు. పులిచర్ల గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించే 'వికసిత భారత్' కార్యక్రమానికి భారీ పరిశ్రమల శాఖ మంత్రి హాజరుకానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు రానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

హాలియా, జనవరి 18: అండర్-14 జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు హాలియాలోని వీఎన్ఆర్ పాఠశాల విద్యార్థి ఎండీ. అఫ్షా ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శివర్ల వెంకటయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 16, 17, 18 తేదీ ల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనగాంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఎండీ. అఫ్షా చక్కటి ప్రతిభ కనబరిచాడు. దీంతో అతడిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అఫ్షాకు ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి జ్ఞాపికను అందజేసినట్లు వెంకటయ్య తెలిపారు. జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన అఫ్షా హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో హనుమాన్ ప్రతిభ

పెద్దవూర, జనవరి 18: సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఈ నెల 11 నుంచి 14 వతేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో మండలానికి న్యూ విజన్ జూనియర్ కళాశాల విద్యార్థి చింతల హనుమాన్ తన ప్రతిభ చాటాడని చైర్మన్ ఎస్‌కె.అబ్బాస్ తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిభ చాటిన విద్యార్థి హనుమాన్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

నకిరేకల్, జనవరి 18: నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్ పోస్టుకు అతిథి అధ్యాపక పోస్టు కోసం ఈ నెల 17 నుంచి 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 22న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు టెట్, సెట్లు, పీహెచ్‌డీతో పాటు బోధనలో అనుభవం ఉన్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం పీజీ, ఓసీ, బీసీ అభ్యర్థులకు 55శాతం చొప్పున మార్కులు ఉండాలన్నారు.

'తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే చర్యలు'

దేవరకొండ, జనవరి 18: తూనికలు, కొలతలల్లో మోసాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల శాఖ నల్లగొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. దేవరకొండలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా కొలతలు ఉండాలన్నారు. వినియోగదారులు ఫిర్యాదులు చేస్తే లైసెన్స్ రద్దుచేసి దుకాణాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

గుర్రంపోడు, జనవరి 18: షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. ఈ సంఘటన గుర్రంపోడు మండలంలోని కట్టవారిగూడెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కట్ట చందుకు చెందిన పూరిల్లు ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ గురై దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దుస్తులు, వంట సామగ్రి తదితర వస్తువులు కాలి బూడిదైపోయాయి. సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. బాధితుడు చందును ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు, గ్రామస్థులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి పట్టణానికి మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికీ తాగునీటిని అందించాలని నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి (ఎన్‌పీఎస్) కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. మిషన్ భగీరథ పథకం కింద పట్టణంలో ఒకవైపు మాత్రమే పైప్‌లైన్లు వేశారని, రెండో వైపు కూడా ప్రత్యేక పైప్‌లైన్ వేసి ఇంటింటికీ తాగునీటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీఎస్ సభ్యులు మేడబోయిన శ్రీనివాస్, కన్నెబోయిన నర్సింహ, గూడూరు అంజిరెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దేవరకొండ: మహిళలపై వివక్షతను విడనాడాలని, బాల్య వివాహాలను అరికట్టాలని మండలంలోని మర్రిచెట్టుతండా సర్పంచ్ నేనావత్ శీనునాయక్ అన్నారు. మర్రిచెట్టుతండాలో సీడబ్ల్యూఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కిషన్‌బావోజీ, సంస్థ ప్రతినిధులు లక్ష్మి, వసంత, అంగన్‌వాడీ టీచర్ అనిత, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ పట్టణంలోని స్వరాజ్ మైదానంలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సామాజిక కార్యకర్త, దళితరత్న అవార్డు గ్రహీత ఏకుల సురేష్ కోరారు.

నల్లగొండ టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి గొడుగు గోవర్ధనగిరి కోరారు. మంత్రి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అతిథి అధ్యాపకులను ప్రతీ సంవత్సరం ఆటో రెన్యువల్ చేయాలని కోరారు. అదేవిధంగా కన్సాలిడేటెడ్ వేతనం ఇస్తూ 12 నెలల పాటు కొనసాగించాలని కోరారు.

నల్లగొండ కల్చరల్: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేపీ నాయకులు జిల్లా కేంద్రంలోని వీటీ కాలనీలో గల శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ఆలయ పరిసరాలను శుభ్రపరిచి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రావిరాల పూజితవెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర నాయకులు బండారు ప్రసాద్, నూకల జైపాల్‌రెడ్డి, విజయ, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు: గుర్రంపోడు గ్రామపంచాయతీలోని వద్దిరెడ్డిగూడెంను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గుర్రంపోడు, వద్దిరెడ్డిగూడెం గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గాలి సరితరవికుమార్ మాట్లాడుతూ చిన్న గ్రామాలతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీటీసీ కుప్ప రాములు, సర్పంచ్ మస్రత్‌జహాసయ్యద్‌మియా, మాజీ ఎంపీటీసీ జాల చిన్నసత్తయ్యయాదవ్, పగిళ్ల లాలయ్య, లక్ష్మారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కోటిరెడ్డి, యాదగిరిరెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు జిల్లా కేంద్రాల్లో 250గజాల నివాసస్థలాన్ని, గౌరవభృతిని మంజూరు చేయాలని తెలంగాణ అమరవీరుల కుటుంబాల వేదిక కోరింది. వేదిక ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అమరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్. నర్సింహ, జి.రఘురాం, జలంధర్ ఏ.ఆనంద్, నరేష్, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, బి.కోట్యానాయక్, రాంబాబు, మునీష్ పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని తేలకంటిగూడెం గ్రామంలో మొబైల్ మెడికేర్ యూనిట్ సభ్యులు, నల్లగొండ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరాన్ని సర్పంచ్ బోగరి రాంబాబు ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు సుమారు 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ పుల్లారావు, డాక్టర్లు శశిధర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు: ఎమ్మెల్యేగా వేముల వీరేశం భారీ మెజార్టీతో గెలిస్తే మేడారం సమక్క సారలమ్మలకు మొక్కు చెల్లించుకుంటానని మండలంలోని పందెనపల్లి గ్రామానికి చెందిన వీరేశం వీరాభిమాని కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మొక్కుకున్నాడు. ఆయన గెలుపొందడంతో తన కుటుంబ సభ్యులతో వెళ్లి గురువారం మేడారం వనదేవతలకు క్వింటా బంగారం (బెల్లం) చెల్లించి మొక్కు చెల్లించారు. కార్యక్రమంలో నాయకులు కుంభం సరితఅనిల్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, కవితశ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని ఊట్కూరు గ్రామంలో ఇళ్ల మధ్య నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న సెల్‌టవర్‌ను నిర్మాణాన్ని నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. గురువారం వారు ఎంపీడీవో లక్ష్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో అక్రమంగా నిర్మిస్తున్న సెల్‌టవర్‌ను నిలిపివేయాలని కోరారు. సెల్ టవర్ వలన రేడియేషన్ వల్ల ప్రజలు రోగాల బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఒక సెల్‌టవర్‌తో ఇబ్బందులు పడుతుంటే మరో సెల్‌టవర్‌ను ఏర్పాటు చేయడాన్ని గ్రామస్థులు ఖండించారు. అధికారులు కూడా అనుమతులు మంజూరు చేస్తూ ప్రజలను రోగాల బారిన పడే విధంగా చేస్తున్నారని, వెంటనే సెల్‌టవర్‌ను నిర్మాణాన్ని నిలిపివేయాలని ముక్తకంఠంగా గ్రామస్థులు కోరారు.

నల్లగొండ టౌన్: ప్రతిష్ఠాత్మకమైన మ్యాథ్స్ ఒలంపియాడ్ ఇంటర్నేషనల్ ఫలితాల్లో పట్టణానికి చెందిన ఓక్‌ట్రీ పాఠశాల చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన 150మంది విద్యార్థులు మొదటి లెవెల్‌లో పాల్గొనగా 34 మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించి సెకండ్ లెవెల్‌కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఆరవ తరగతి నుంచి ఇంటిగ్రేటెడ్ సిలబస్‌తో పాటు అత్యుత్తమ అధ్యాపకులతో బోధించడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధ్యమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గడ్డం మంగారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.